


ఆస్పత్రిలో రాజలింగ మూర్తి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

# గులాబీలో.. డైలమా!



## ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంపై శ్రేణుల్లో అసంతృప్తి

- ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో స్వతంత్రులుగా బీఆర్ఎస్ నేతలు
- వరంగల్ నుంచి సుందర్‌రాజ్, కరీంనగర్ నుంచి రవీందర్‌సింగ్, శేషగిరిరావు పోటీ
- పార్టీ మద్దతు లేకుండానే బరిలో దిగిన నేతలు
- క్యాడర్ తమ పార్టీ నేతలవైపా? బీజేపీ వైపా?
- మద్దతు ఎవరికనేదానిపై అయోమయం
- 2019లో పీఆర్‌టీయూ, స్వతంత్రులకు మద్దతిచ్చిన గులాబీదళం
- ఈసారి వారి మద్దతు కోరని ఉపాధ్యాయ సంఘాలు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ అనుసహస్తం ఎవరికో?
- మద్దతు విషయమై ఆ పార్టీ నాయకుల్లోనూ ఉత్కంఠ

7



ఓ వైపు వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు.. మరోవైపు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల పోరుతో సర్వత్రా రాజకీయ సందడి కనిపిస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో బీజేపీ ప్రచారంలో జోష్ చూపుతుండగా.. కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ కూడా ప్రచారం పర్వంలో ముందుకు సాగుతోంది. కానీ 'గులాబీ' కేడర్ మాత్రం డైలమాలో ఉంది. ఈ ఎన్నికల్లో తమ పార్టీ విధానం ఏంటనే దానిపై స్పష్టత లేక.. ఏ పార్టీకి, ఏ సంఘానికి, ఏ అభ్యర్థికి మద్దతివ్వాలనే దానిపై అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన లేక శ్రేణులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మరోవైపు అధిష్ఠానం పోటీకి దూరమని ప్రకటించిన నేపథ్యంలో పార్టీ టికెట్ ఆశించిన పలువురు నేతలు స్వతంత్రులుగా బరిలో దిగగా.. వారికి కూడా పార్టీ మద్దతు ప్రకటించకపోవడం మరింత గందరగోళానికి దారితీస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ ఉన్న రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకుంటున్న ఉపాధ్యాయ సంఘాలు ఆ పార్టీ మద్దతు కోసం ప్రయత్నించడం లేదు. చివరకు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ మద్దతు పొందిన ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆసక్తి చూపడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇక రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో అభ్యర్థులను బరిలో దింపని కాంగ్రెస్.. కేవలం కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో మాత్రమే అభ్యర్థిని పోటీకి పెట్టింది. ఈ క్రమంలో వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లో విలీనమైన పూర్వ కరీంనగర్ జిల్లాకు చెందిన ఎనిమిది మండలాల్లోని 7,068మంది పట్టభద్రులు, 249మంది ఉపాధ్యాయ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారోనన్న చర్చ జరుగుతోంది.

– ఆంధ్రజ్యోతి, వరంగల్ ప్రతినిధి

# సామాజిక కార్యకర్త దారుణ హత్య



- రాజలింగమూర్తిని పొడిచి చంపిన దుండగులు
- భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఘటన
- స్థానిక భూవివాదాలే కారణమని చర్చ
- 'మేడిగడ్డ' కేసు సహా పలు వివాదాల్లో రాజలింగమూర్తి జోక్యం

ఘటనా స్థలంలో రక్తపు మడుగులో రాజలింగ మూర్తి


రాజలింగమూర్తి (ఫైల్)

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సామాజిక కార్యకర్తగా పేరున్న.. దేశవ్యాప్తంగా సంచలనమైన కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటు విషయంలో మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రి హరీ‌ష్‌రావు, ఇంజనీర్లపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి సంచలనం రేపిన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీకి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం రాత్రి గుర్తుతెలియని ఆగంతుకులు రాజలింగమూర్తిని కత్తులతో పొడిచి హతమార్చారు. భూపాలపల్లి పట్టణంలో తీవ్ర కలకలం రేపిన ఈ ఘటన సంబంధించి పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి సమీపంలోని తన ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతున్న రాజలింగమూర్తిని.. ఆ మార్గంలో నిర్మానుష్యంగా ఉండే టీబీజీకేఎస్ కార్యాలయ సమీపంలో ఆటోలో వెనుకనుంచి వచ్చిన ఐదారుగురు గుర్తుతెలియని వ్యక్తులు అతడి ద్విచక్రవాహనాన్ని అడ్డగించి ముకుమ్మడిగా కత్తులతో దాడి చేసి పొట్టలో, ముఖంపై పొడిచి తాము వచ్చిన ఆటోలోనే పరారయ్యారు. దీంతో రాజలింగమూర్తి అక్కడే కుప్పకూలిపోగా.. అటుగా వచ్చిన స్థానికులు రక్తపుమడుగులో పడి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. భూపాలపల్లి పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి

» మిగతా 8వ పేజీలో...

## మేడారంలో ఘనంగా తిరుగువారం


గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

7లో

ముఖాముఖి


బిల్లా శ్రీనివాస్
రామప్ప ఆలయ ఈవో

## మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

– రామప్ప ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్

**ఆంధ్రజ్యోతి** : మహాశివరాత్రి ఉత్సవాలు ఎప్పుడు ప్రారంభం అవుతాయి..? ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

**ఈవో** : ఈనెల 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి** : భక్తులకు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు ?

**ఈవో** : రామప్పలో నిరంతరం విద్యుత్, భక్తులకు తాగునీటి సౌకర్యం, ప్రత్యేక పార్కింగ్ స్థలం, చలువ పందిళ్ల ఏర్పాటు, హెల్త్ క్యాంపు, క్యూలైన్ల సౌకర్యం కల్పించాం. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం.

**ఆంధ్రజ్యోతి** : ఈసారైనా పాలకవర్గం ఏర్పడనుందా?

**ఈవో** : రామప్ప దేవాలయంలో పాలకవర్గం ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఎప్పుడు ఉంటుందనేది స్పష్టంగా చెప్పలేం.

**ఆంధ్రజ్యోతి** : మహాశివరాత్రి ఉత్సవాలకు ఎంతమంది భక్తులు వచ్చే అవకాశం ఉంది ?

**ఈవో** : ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతూనే ఉంది. గత ఏడాది 50వేలపై చిలుకు మంది భక్తులు వచ్చారు. ఈ ఏడాది ఉత్సవాలకు ఇంకా ఎక్కువ మొత్తంలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. వారి కోసం మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి** : మహాశివరాత్రిలో జాగరణ చేసే భక్తులకు ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి?

**ఈవో** : మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రామప్పకు జాగరణ కోసం వచ్చే భక్తులకు భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. బయట నుంచి వచ్చే కళాకారులతోపాటు స్థానికులకూ అవకాశం కల్పిస్తాం. శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాం.

**ఆంధ్రజ్యోతి** : మహాశివరాత్రికి భక్తులకు రవాణా సౌకర్యం ఎలా ఉండబోతుంది?

**ఈవో** : రామప్పకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా సౌకర్యం ఏర్పాట్లు చేస్తున్నాం. హనుమకొండ, పరకాల, భూపాలపల్లి ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ఇప్పటికే డిపో మేనేజర్లకు సమాచారం కూడా ఇచ్చాం.

– వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి)

## వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

### కలెక్టర్ రాహుల్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సరఫరాతోపాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, విద్యుత్ అధికారులు, ఎంపీడీవోలతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. వేసవిలో తాగునీటి, నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరాపై సమీక్షించారు. నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లను క్రమం తప్పకుండా పరిశీలించి ఎక్కడైనా మరమ్మతులు అవసరం ఉంటే వెంటనే సరిచేయాలని అన్నారు. నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. నీటి వృథాను అరికట్టాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటే తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1912కు కాల్ చేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలన్నారు. గత ఏడాది వేసవిలో సమస్యలు వచ్చిన గ్రామాల్లో ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మల్సూర్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డిపిఓ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

### కేజీబీవీని తనిఖీ చేసిన కలెక్టర్

రేగొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వంట గదిని, పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాలలో సౌకర్యాలు, భోజన నాణ్యత ఎలా ఉందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వారికి నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చదవాలన్నారు. వెనుకంజలో ఉన్న సబ్జెక్టుపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని సూచించారు. విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తే కళ్లద్దాలను అందిస్తామని తెలిపారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్వేతారావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ మనోరమ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

### డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి


సమస్యల పరిష్కారం కోసం శపథం చేస్తున్న ఉపాధ్యాయులు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. జంగేడులో బుధవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేయాల్సిన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని అన్నారు. ఎన్ఈపీ 2020ని రద్దు చేసి శాస్త్రీయ విద్యా విధానాన్ని తీసుకురావాలని అన్నారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మెడికల్ బిల్లులను వెనువెంటనే విడుదల చేయాలని, నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం వల్ల ఉపాధ్యాయులు చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు అపర్ణ, గోవర్ధన్, నరేష్, మౌనిక, జంపయ్య, శ్రీధర్‌రెడ్డి, రాజుచ వీరన్న, అశోక్, జయప్రకాశ్, సుదర్శన్, విష్ణుమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజీఎస్ ఫియర్!


జిల్లా కేంద్రంలోని జీజీహెచ్

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కరోనా తరువాత ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్న వ్యాధి. ప్రస్తుతం ఈ జీబీఎస్ కేసులు రాష్ట్రంలో అక్కడక్కడా నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో జీబీఎస్ బాధితుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖను సన్నద్ధం చేస్తోంది. అందులో భాగంగా మహారాష్ట్రకు సరిహద్దున ఉన్న భూపాలపల్లి వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి.. చికిత్స అందించేందుకు వారు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో ఐసీయూ వార్డును అందుకు సిద్ధం చేశారు.

– భూపాలపల్లి కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

- ప్రజల్లో 'గులియన్ బారే సిండ్రోమ్' భయం
- పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో వేగంగా విస్తరణ
- ఇక్కడ ప్రబలకుండా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు
- అప్రమత్తమైన వైద్యఆరోగ్యశాఖ
- భూపాలపల్లి జీజీహెచ్‌లో ఐసీయూ వార్డు సిద్ధం

7



## సుడిబాకలో హైనా సంచారం!

వెంకటాపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలం మరికాల గ్రామపంచాయతీ పరిధిలోని సుడిబాక గ్రామ శివారులోని పంట పొలాల్లో హైనా సంచరించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. సెక్షన్ అధికారి దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని పూనెం సుర్రు అనే రైతు తన మొక్కజొన్న పంటను కోతులు, అటవీ జంతువులు పాడు చేయకుండా కాపలా ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మొక్కజొన్న చేను వద్ద సుర్రు తన పెంపుడు కుక్కను మంచెకు కట్టేసి భోజనం చేసేందుకు ఇంటికి వచ్చాడు. తిరిగి చేను వద్దకు వెళ్లేసరికి కుక్క చనిపోయి ఉండడాన్ని గమనించి పక్కనే ఉన్న పాద ముద్రలను గుర్తించి పెద్దపులి అనుకుని భయంతో గ్రామంలోకి వెళ్లి గ్రామస్థులకు తెలిపాడు. బుధవారం ఉదయం గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఈ విషయం తెలపడంతో వారు సంఘటన ప్రాంతానికి చేరుకుని పాదముద్రలను గుర్తించి హైనావిగా ధ్రువీకరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సెక్షన్ అధికారి సూచించారు.

## ట్రాక్టర్ పైనుంచి పడి మహిళ దుర్మరణం

- తొర్రూరు మండలం మడిపల్లిలో ఘటన

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి గ్రామ శివారులో మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి మహిళ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామ శివారు ఇందియాతండాకు చెందిన బానోతు మంజుల(30) నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం గ్రామ శివారు సొసైటీతండాకులోని బంధువుల ఇంట్లో వివాహానికి వచ్చింది. రాయపర్తి మండలం సన్నూర్ గ్రామ శివారు సుభాష్ తండాలో బుధవారం జరిగే రిసెప్షన్‌కు ట్రాక్టర్‌లో వెళ్తున్నారు. ఈక్రమంలో తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారు ముత్యాలమ్మ గుంట వద్ద ట్రాక్టర్ అదుపు తప్పడంతో డ్రైవర్ పక్కనే కూర్చున మంజుల ట్రాక్టర్ పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. మంజుల భర్త గతంలో మృతి చెందగా ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మృతురాలు తమ్ముడు భాస్కర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంజీనాయక్ తెలిపారు.

## మానుకోట రైస్‌మిల్లుల్లో తనిఖీలు



మానుకోటలోని రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని శ్రీసాయి, జగదాంబ రైస్‌మిల్లులను అదనపు కలెక్టర్(రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి, సివిల్‌సప్లై అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, ధాన్యం నిల్వలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన జిల్లా లక్ష్యం ప్రకారం.. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిల్వలను షెడ్యూల్ ప్రకారం వెంటనే పెట్టాలని సూచించారు. ఖరీఫ్ 2024-25కు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాలను నిర్లక్ష్యం చేయకుండా వేగిరం చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా సివిల్‌సప్లై అధికారులు రైస్‌మిల్లుల్లో తనిఖీ నిర్వహించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ జిల్లా సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, డీఎం కృష్ణవేణి, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## యూరియాకు పురుగుల మందు లింకు

- దంతాలపల్లిలో రైతులకు తప్పని ఇబ్బందులు

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యూరియాను ఫర్టిలైజర్ షాపు వారు లింకు పెట్టడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు మాత్రం యూరియా కొరత లేదంటూ పేర్కొంటున్నా, ఫర్టిలైజర్ షాపుల్లో కొరత సృష్టిస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో లింకుతో పురుగుల మందును తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇటీవల దంతాలపల్లి మండలకేంద్రంలోని ఓషాపులో లింకు పేరుతో మందు ఇవ్వడంతో రైతు తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయం మరిచిపోకముందే తిరిగి ఫర్టిలైజర్‌షాపు నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పేరుకే ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.267గా బోర్డును ప్రదర్శిస్తూ విక్రయంలో రశీదును సైతం ఇవ్వడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఈవిషయంపై అధికారుల చోద్యం చూస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.



# అరకొరగా 'రైతు భరోసా'

- 2.10 ఎకరాలు ఉన్న రైతుకు పది గుంటలకే అందిన సాయం
- జిల్లాలో 65 శాతం మందికి మాత్రమే డబ్బులు జమ
- ఇప్పటి వరకు 1,41,077 మంది ఖాతాల్లో నిధులు
- కొన్ని హోల్డింగ్‌లో.. ఇబ్బంది పడుతున్న కర్షకులు



మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రైతు భరోసా పెట్టుబడి సాయం కొన్ని మండలాల్లోని కొందరికీ అరకొరగానే విడుదయ్యాయి. 2.10 ఎకరాలు ఉన్న ఓ రైతుకు 10 గుంటలకే రైతుభరోసా నిధులు పడ్డాయి. మరో కొన్నిచోట్ల రెండెరాలు, ఎకరం ఉన్న రైతులకు రైతు భరోసా నిధులు పడలేదు. వారి ఖతాలు హోల్డింగ్, ప్రాసెసింగ్‌లో ఉన్నట్లు వ్యవసాయ శాఖ యాప్‌లో చూపిస్తుండడంతో రైతులు పరేషాన్‌కు లోనవుతున్నారు. దాంతో వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంక్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో మరికొన్నిచోట్ల రెండెకరాల వరకు పెట్టుబడి సాయం అందింది.

### అధికారులతో వాగ్వాదం

మహబూబాబాద్ జిల్లాలో పలుచోట్ల ఇలాంటి సమస్యతోనేరైతులు సతమతమవుతున్నారు. మూడెకరాల వరకు ఉన్న వారికి రైతుభరోసా నిధులు పడుతున్నాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే జిల్లాలోని పలు మండలాల్లో రెండెకరాల వరకు నిధులు పడ్డాయి. ఇదిలాఉండగా మహబూబాబాద్ మండలంలోని పలు గ్రామాల్లోని రైతుల ఖాతాలను హోల్డింగ్‌లో పెట్టారు. సర్వే నెంబర్ల బై నెంబర్లలో ఒక విధంగా, రైతుల ఖాతాల పాస్‌బుక్కుల్లో మరో విధంగా భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గులు.. తేడాలు ఉండడంతో రైతు భరోసా నిధులు హోల్డింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. రైతులు ఉరుకులు.. పరుగులతో వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్తే వారి ఖాతాలు ప్రాసెసింగ్‌లో ఉన్నట్లు చూపిస్తుండగా మరికొన్నిఖాతాలు హోల్డింగ్‌లో ఉన్నట్లు చూపిస్తున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో వాగ్వాదంకు దిగుతున్నారు. నామ మాత్రంగానే రైతుభరోసా నిధులు వచ్చాయని, మిగతా భూమికి ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారు. మరికొంతమంది రైతులకు అసలే రాలేదు. మహబూబాబాద్ మండలం అమనగల్ గ్రామంలో ఇలాంటి సమస్యతో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

### జిల్లాలో 2,15,581 మంది అర్హులు

గత నెల 26 నుంచి రైతుభరోసా నిధులు విడుదలవుతాయని ప్రభుత్వం చెప్పిన విధంగా నిధులు విడుదలయ్యాయి. 27వ తేదీ నుంచి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లోకి కాస్తంత స్లోగా పడుతున్నాయి. జిల్లాలో 2,15,581 మంది రైతులు అర్హులుగా వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. బుధవారం నాటి వరకు జిల్లాలో 1,41,077 మంది రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు పడ్డాయి. అంటే దాదాపు రూ.115.12 కోట్లు (65) శాతం రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఇంకా 74, 504 మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడాల్సి ఉంది. రైతులు తమకు ఎప్పుడు డబ్బులు పడతాయోనని భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.

### 10 గుంటలకే రైతు భరోసా పడ్డాయి

**పూజారి ఎల్లయ్య**
**రైతు, అమనగల్, మహబూబాబాద్**



నాకు 2.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి పంటను సాగు చేశా. అయితే 10 గుంటల వరకే రైతు భరోసా నిధులు ఖాతాలో పడ్డాయి. మిగతా రెండెకరాలకు రైతు భరోసా నిధులు రాలేదు. దీంతో పెట్టుబడి సాయం కోసం బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టు తిరుగుతున్నా... నా ఖాతా హోల్డింగ్‌లో ఉందని చెబుతున్నారు. దానిని సరిచేసి నాకు రెండెకరాల రైతు భరోసా నిధులు మంజూరు చేయాలి.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

కాటారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని విలాసాగర్ మానేరు నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్సై అభినవ్ బుధవారం తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు, ట్రాక్టర్ డాక్యుమెంట్లు లేకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ సందీప్, ఓనర్ శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే కాగారం గ్రామానికి చెందిన లక్ష్మీ వద్ద 5 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. అనంతరం ఆ మహిళపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

### పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టర్లు?

మొగుళ్లపల్లి : మండలంలోని పోతుగల్లు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతోపాటు ఇసుకను పోసే యంత్రాన్ని బుధవారం స్థానిక పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ప్రతిరోజు ఉదయం, రాత్రి తేడాలేకుండా టేకుమట్ల, చిట్యాల మండలం నవాబుపేటకు చెందిన కొంతమంది ట్రాక్టర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని పోతుగల్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలించలేదు. కానీ, గత కొన్నినెలల నుంచి అడ్డూఅదుపు లేకుండా ఇతర మండలాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇష్టారాజ్యంగా ఇసుకను తరలించడం విడ్డూరంగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయాలు, అభివృద్ధి పనుల కోసమంటూ ఇసుకను తరలిస్తున్నారని కానీ, ఇసుకతో వ్యాపారం చేస్తూ లక్షలాదిరూపాయలు గడిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

## లెనిన్‌నగర్‌లో చోరీ

- 2.5 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు అపహరణ
- టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

మహబూబాబాద్‌రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మానుకోట పట్టణంలోని లెనిన్‌నగర్‌లో బుధవారం తెల్లవారు జామున ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈఘటనలో 2.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదును దొంగలు అపహరించుకుపోయారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... లెనిన్‌నగర్‌కు చెందిన బల్లెం మార్కయ్య పాస్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మార్కయ్య-సంతోష దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. మార్కయ్య ఇటీవల మార్కయ్య అనారోగ్యంతో ఉండడంతో 20 రోజుల క్రితం చికిత్స నిమిత్తం ఆయన భార్య సంతోష చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. చిన్నకుమారుడు కారు డ్రైవింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఇటీవలనే మార్కయ్య మహిళా సంఘం నుంచి రుణం ద్వారా వచ్చిన రూ.1.50 లక్షలను బీరువాలో పెట్టినట్లు చెప్పారు. మంగళవారం రాత్రి చిన్నకుమారుడు కారు డ్రైవింగ్‌కు వెళ్లాడు. మరుసటిరోజు రాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంట్లో లైట్లు వేసి ఉండడంతో ఇంటిపక్క వారు గమనించి చూసే సరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో అనుమానం వచ్చిన వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కారు డ్రైవింగ్‌కు వెళ్లి వచ్చిన చిన్నకుమారుడు చంటి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉండాల్సిన 2.5 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు అపహరించుకుపోయినట్లు చెప్పాడు. ఈ విషయంపై టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చంటి తెలిపారు.



డోర్నకల్ మండలంలో చుక్కనీరు లేక ఎండిపోయిన మున్నేరు

## వట్టిపోయిన మున్నేరు

- సాగునీటి కోసం రైతుల తండ్లాట
- ఎస్సారెస్పీ జలాలతో నింపాలని విజ్ఞప్తి

డోర్నకల్(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మండలంలో ఫిబ్రవరి నెలలోనే రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలలో నీరు లేకపోవడంతో వాటి కింద సాగు చేసిన పంటల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. డిసెంబరు వరకు కుంటలు, చెరువులు, చెక్‌డ్యాంలలో నీరు నిండుగా ఉండడంతో రైతులు పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలు నీరులేక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు సైతం అడుగంటి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రధాన నీటి వనరులైన ఆకేరు, మున్నేరు సైతం పూర్తిగా ఎండిపోయాయి. అలాగే వేసవి ఆరంభం కాకముందే ఆకేరు, మున్నేరు వాగులు ఎండిపోవడంతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వాటి పరిధిలో వేసిన పంటలను కాపాడుకోవడానికి తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా కృషి చేసి ఎస్సారెస్పీ జలాలు విడుదల చేసి చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలను నింపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పలుగుల ఫారెస్ట్‌లోనే పెద్ద పులి!

- ముమ్మరంగా అటవీ శాఖ గాలింపు
- నాలుగు బృందాలుగా ఏర్పడి అన్వేషణ

మహదేవపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పెద్ద పులి సంచారం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల ప్రజలను కంటికి కునుకు లేకుండా చేస్తోంది. బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. ఒకవైపు మిర్చి పంట చేతికి వస్తుండగా పొలాల వద్దకు రైతులు వెళ్లక తప్పని పరిస్థితి ఉండగా పులి సంచరిస్తోందనే వార్తలు కలవర పెట్టిస్తున్నాయి. మహదేవపూర్ మండలం పలుగుల అడవిలోనే పులి ఇంకా సంచరిస్తున్నట్లు ఫారెస్టు అధికారులు గుర్తించారు. నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపడుతున్నారు. అన్నారం, బీరసాగర్ అడవుల్లో అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల శివార్లలో బుధవారం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఇప్పటి వరకు పులి కోసం 16 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.





పలుగుల గ్రామ శివారులోని అడవిలో పులి అడుగులను గుర్తిస్తున్న అధికారులు, గుర్తించిన పులి అడుగు

ఆదిలాబాద్ నుంచి వచ్చిన యానిమల్ ట్రాకింగ్ టీం సభ్యులు పులి పాదముద్రలను పరిశీలిస్తున్నారు. పలుగుల అడవులు, పంట పొలాలు చుట్టుపక్కల పరిశీలించిన అధికారులు పులి పాదముద్రలను గుర్తించారు. పాదముద్రల ఆధారంగా అడవిని జల్లెడ పడుతున్నారు. కుంటలు, వాగులు, ఒర్రెల వద్ద పులి పాదముద్రలు గుర్తించారు.

## ఆరోగ్యం సహకరించక సింగరేణి కార్మికుడి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

గణపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం చేయడానికి ఆరోగ్యం సహకరించట్లేదని ఓ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో చోటుచేసుకుంది. మృతుడి తల్లి గసిగంటి లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఉట్నూరు గ్రామానికి చెందిన గసికంటి లక్ష్మి-ముత్యాలు దంపతుల కుమారుడు తిరుపతి (28) భూపాలపల్లి సింగరేణి ఏరియా కేటీకే 8వ గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. 2019లో తండ్రి ముత్యాలు మెడికల్ అన్‌ఫిట్ కాగా చిన్న కుమారుడైన తిరుపతికి ఈ ఉద్యోగం వచ్చింది. భార్య మౌనికతో కలిసి తిరుపతి గణపురం మండలం చెల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సింగరేణి కార్వర్టర్స్ రామప్ప కాలనీలో నివసిస్తున్నాడు. ఉద్యోగం పొందడానికి ఆరోగ్యం సహకరించక పోవడంతో మనస్తాపం చెందిన తిరుపతి మంగళవారం రాత్రి భార్య నిద్రిస్తుండగా ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం చూసిన మౌనిక పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అశోక్ తెలిపారు.



బాలుడికి పండ్లు, బెడ్‌షీట్ అందజేస్తున్న పోలీస్ అధికారులు

## దివ్యాంగులకు 5వ బెటాలియన్ వితరణ

గోవిందరావుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ 5వ బెటాలియన్ సిబ్బంది బుధవారం వార్షిక పునఃశ్చరణ శిక్షణలో భాగంగా హనుమకొండ జిల్లా కాజీపేటలోని అనాథాశ్రమం దివ్యాంగులకు పండ్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్లు జి.కార్తీక్, డి.అన్నయ్య, ఆర్ ఎస్సైలు రవీందర్, రఘు, బాబురెడ్డి, ఏఆర్ ఎస్సైలు శ్రీనివాస్, సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం స్వాధీనం

కాటారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని బొప్పారం క్రాస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్సై అభినవ్ తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా బొప్పారం క్రాస్ వద్దకు చేరుకున్నారు. అప్పుడే అటుగా వస్తున్న ట్రాలీ కనిపించగా తనిఖీలు చేశారు. దీంతో అందులో బియ్యం బస్తాలు కనిపించడంతో పరిశీలించగా సుమారు 8 క్వింటాళ్ల మేర పీడీఎస్ బియ్యం ఆ వాహనంలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో బియ్యం సహా ట్రాలీని సీజ్ చేశారు. డ్రైవర్ రమేష్‌తో పాటు బియ్యం సేకరించి దందా చేస్తున్న సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఐలాపూర్‌లో తిరుగువారం పండగ

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని అటవీ గిరిజన గ్రామమైన ఐలాపూర్‌లో వనదేవతలు సమ్మక్క-సారలమ్మల జాతర తిరుగువారం పండగను పూజారులు, వడ్డెలు గ్రామస్థులు బుధవారం ఘనంగా నిర్వహించారు. డోలు వాయిద్యాలు, సన్నాయి మేళతాళాల మధ్య గిరిజన సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవర బాలలకు సమ్మక్క దేవత పూనకం అయ్యి భక్తులకు దర్శనం ఇచ్చింది. ఈ సందర్భంగా గద్దెల ప్రాగణంలో భక్తులు బోర్ల పడుకొని మొక్కులు చెల్లించుకుని దీవెనలు పొందారు. ఈ కార్యక్రమంలో దేవర బాల మల్లె మధు, మల్లె రవి, ఆలం నగేష్, పీరీల సురేష్, పీరీల భాస్కర్, కోడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### బుట్టాయిగూడెంలో జాతర ప్రారంభం

మండలంలోని బుట్టాయిగూడెంలో సమ్మక్క-సారలమ్మ మినీ జాతర బుధవారం ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు ఇది కొనసాగనుంది. గామస్థులు, పూజారులు, వడ్డెలు ఇల్లూవాకిల్లు శుభ్రం చేసుకొని గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని గోదావరికి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. దేవతల ప్రతిమలను గోదావరి జలంతో శుద్ధి చేశారు. గద్దెలు, గుడి ప్రాంగణంలో గోదావరి జలాలు చల్లారు. అనంతరం సాయంత్రం పూజారులు పొడెం రామలక్ష్మి, కోరం లక్ష్మినర్సు, వడ్డెలు నల్లెబోయిన వంశస్థులు, గ్రామస్థులు కలిసి సారలమ్మ దేవతను తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. గురువారం సమ్మక్క దేవత గద్దెకు రానుంది.



ఐలాపూర్‌లో గద్దెల వద్ద పూజలు చేస్తున్న పూజారులు, భక్తులు

## వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | 2322 | 2100 |
| పల్లికాయ (సూక) | 6770 | 4600 |
| పల్లికాయ (పచ్చిది) | 5000 | 3100 |
| కందులు | 7251 | 5540 |
| పెసళ్లు | 7169 | 4645 |
| పత్తి | 6810 | 5800 |
| పసుపు (కాడి) | - | - |
| పసుపు (గోల) | - | - |
| తేజ మిర్చి | 13400 | 9000 |
| తేజ ఏసీ | - | - |
| వండర్‌హాట్ | 16100 | 11500 |
| ఎల్లో మిర్చి | 17000 | 17000 |
| యూఎస్341 | 13300 | 11500 |
| దేశీ ఏసీ | 25050 | 22500 |
| దీపిక | 16000 | 15245 |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 6500 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

# గులాబీలో డైలమా!



- ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంపై శ్రేణుల్లో అసంతృప్తి
- ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో స్వతంత్రులుగా బీఆర్ఎస్ నేతలు
- పార్టీ మద్దతు లేకుండానే బరిలో దిగిన నేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎమ్మెల్సీ ఎన్నికలు 'గులాబీ' పార్టీ క్యాడర్‌ను డైలామాలో పడేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఇప్పటి వరకు ఏ పార్టీకి, సంఘానికి, అభ్యర్థికి అధికారికంగా బీఆర్ఎస్ మద్దతు ప్రకటించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ క్యాడర్ జోష్‌గా తిరుగుతుంటే.. గులాబీ కార్యకర్తలు మాత్రం తమ అభ్యర్థి బరిలో లేక.. మద్దతు ఎవరికిస్తున్నామో తెలియక లేక డీలా పడుతున్నారు. మరోవైపు అధిష్ఠానం పోటీకి దూరమని ప్రకటించిన నేపథ్యంలో పార్టీ టికెట్ ఆశించిన పలువురు నేతలు స్వతంత్రులుగా బరిలో దిగారు. వీరికి కూడా పార్టీ మద్దతు ప్రకటించలేదు. దీంతో స్వతంత్రులుగా పోటీ చేస్తున్న గులాబీ నేతలకా.. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీకి మద్దతు ఇవ్వాలా అనే అయోమయం గులాబీ శ్రేణుల్లో నెలకొంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ పార్టీ మద్దతు కోసం తహతహలాడిన ఉపాధ్యాయ సంఘాలు.. ఈసారి బీఆర్ఎస్ మద్దతు కోరేందుకు వెనుకడుగు వేస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది.

### స్వతంత్రులుగా గులాబీ నేతలు

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు హనుమకొండ, భూపాలపల్లి జిల్లాలో పూర్వ కరీంనగర్ జిల్లాకు చెందిన ఎనిమిది మండలాలు విలీనమయ్యాయి. ఈ మండలాల్లో 7,068 మంది పట్టభద్రులు, 249మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు. దీంతో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారనే చర్చ జరుగుతోంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు. టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నాలు చేశారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించటంతో ఆశావహులు అసంతృప్తికి గురయ్యారు. అయితే వారిలో కొందరు స్వతంత్రులుగా బరిలో దిగారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి వరంగల్ కుడా మాజీ ఛైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ బీసీ సంఘాల మద్దతుతో పోటీలో ఉన్నారు. అలాగే చివరి వరకు బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటికి దిగారు. అలాగే ట్రస్మా రాష్ట్ర మాజీ ఛైర్మన్ యాదగిరి శేషగిరిరావు కూడా బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేసి, స్వతంత్రులుగా బరిలో దిగారు. అయితే వీరికి బీఆర్ఎస్ అధికారికంగా మద్దతు ప్రకటించలేదు. అంతేకాకుండా పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్నారని వీరిపై పార్టీపరంగా ఎలాంటి చర్యలు కూడా తీసుకోవటం లేదు. దీంతో పార్టీ క్యాడర్ గందరగోళంలో పడింది. అధిష్ఠానం ఏం సందేశం ఇస్తుందో అని తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఉపాధ్యాయుల్లోనూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నవారు అనేకమంది ఉన్నారు. ఇప్పటికి కొంత బీఆర్ఎస్‌పైనా.. కేసీఆర్‌పైనా అభిమానంతో ఉన్నవాళ్లున్నారు. అలాగే పట్టభద్రుల్లోనూ బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు కూడా ఉన్నారు. వీరంతా ఎవరి వైపు మొగ్గుచూపాలో అయోమయానికి గురవుతున్నారు. పార్టీ నుంచి ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారికి కూడా పార్టీ మద్దతు ప్రకటించలేదు. దీంతో కాంగ్రెస్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు క్యాడర్ బీజేపీ వైపు మొగ్గుచూపుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే బీజేపీ నేతలు.. బీఆర్ఎస్‌లోని ద్వితీయ శ్రేణి నేతలు, పట్టభద్రులతో సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం.

### ఉపాధ్యాయ సంఘాలు దూరమే..

2019లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు కోసం ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ప్రయత్నాలు చేశాయి. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేసిన పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌కు బీఆర్ఎస్ మద్దతిచ్చింది. అలాగే కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పాతూరి సుధాకర్‌రెడ్డికి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రశేఖర్‌గౌడ్‌కు సైతం బీఆర్ఎస్ మద్దతు ఇచ్చింది. బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన ముగ్గురు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. దాంతో 2019లోనే ఉపాధ్యాయులు, పట్టభద్రులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారనే సంకేతకాలిచ్చారన్న చర్చ ఉంది. అప్పుడు అధికారంలో ఉన్నప్పుడే పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఆదరించలేదన్న అభిప్రాయాలతో.. ఇప్పుడు బీఆర్ఎస్ మద్దతు కోరేందుకు ఉపాధ్యాయ సంఘాలు, ఇండిపెండెంట్లు ఆసక్తి చూపటం లేదనే ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ కూడా వ్యూహాత్మకంగా ఎన్నికలకు దూరంగా ఉంటోందనే చర్చ ఉంది. దీంతో ఎవరి పక్షాన నిలవాలన్న సందిగ్ధంలో బీఆర్ఎస్ శ్రేణులున్నాయి.

### కాంగ్రెస్ మద్దతు ఎవరికో ?

రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల బరిలో కాంగ్రెస్ అభ్యర్థులు లేరు. కాంగ్రెస్ కూడా కేవలం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచే అభ్యర్థిని బరిలో దించింది. అయితే వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి జీ.హర్షవర్ధన్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో ఎన్నికల నాటికి ఏదో ఒక ఉపాధ్యాయ సంఘానికి లేదా స్వతంత్రులుగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతల్లో ఒకరికి మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ నేత రఘోత్తంరెడ్డికి మద్దతు ఇచ్చింది. వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి వామపక్షాలతో పాటు కాంగ్రెస్ కూడా సహకరించిందనే చర్చ ఉంది. ఈసారి కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ మద్దతు కీలకం కావటంతో పలువురు అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు..**

| జిల్లా | పురుషులు | మహిళలు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|
| వరంగల్ | 1474 | 878 | 2,352 |
| హనుమకొండ | 2943 | 2272 | 5,215 |
| మహబూబాబాద్ | 1112 | 551 | 1663 |
| జనగామ | 614 | 388 | 1002 |
| భూపాలపల్లి | 215 | 114 | 329 |
| ములుగు | 405 | 223 | 628 |
| సిద్దిపేట | 123 | 43 | 166 |
| మొత్తం | 6,886 | 4469 | 11,355 |

**కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఓటర్లు**

| జిల్లా | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|
| హనుమకొండ | 3,162 | 1,423 | 4,585 |
| భూపాలపల్లి | 1,734 | 749 | 2483 |
| మొత్తం | 4,896 | 2,172 | 7,068 |

**కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఉన్న ఓటర్లు**

| | | | |
|---|---|---|---|
| హనుమకొండ | 126 | 40 | 166 |
| భూపాలపల్లి | 64 | 19 | 83 |
| మొత్తం | 190 | 59 | 249 |

# జీబీఎస్.. ఫియర్!

- ప్రజల్లో 'గులియన్ బారే సిండ్రోమ్' భయం
- పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో వేగంగా విస్తరణ
- ఇక్కడ ప్రబలకుండా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- భూపాలిపల్లి జీజీహెచ్‌లో ఐసీయూ వార్డు సిద్ధం


భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు గులియన్ బారే సింద్రోమ్ (జీబీఎస్) ఫియర్ వెంటాడుతోంది. కరోనా తరువాత అంతగా భయపెడుతున్న ఈ జీబీఎస్ కేసులు రాష్ట్రంలో అక్కడక్కడా నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో జీబీఎస్ వ్యాధి నివారణకు జిల్లా వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో ఐసీయూ వార్డును జీబీఎస్ బాధితుల కోసం ఉపయోగించేందుకు సిద్ధం చేశారు.

### వ్యాధి లక్షణాలు

గులియన్ బారే సింద్రోమ్.. ప్రధానంగా రోగ నిరోధక వ్యవస్థ, నాడీ వ్యవస్థపై దాడి చేస్తుంది. ఈ వ్యాధి బారినపడిన వారిలో ఆయాసం, తిమ్మిర్లు, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, శ్వాససంబంధిత సమస్యలు తలెత్తడం, రోగనిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత కనిపిస్తాయి. ఈ లక్షణాలు బహిర్గతమైన వారు సమీపంలోని ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. సకాలంలో రోగికి వైద్యం అందకపోతే మరణించే ప్రమాదం కూడా ఉంది. వ్యాధి లక్షణాలతో తీవ్రంగా బాధపడుతున్న వారి రక్త, మూత్ర నమూనాలతో పాటు వెన్నెముక నుంచి నీరు తీసి వ్యాధి తీవ్రతను నిర్ధారిస్తారు. జీబీఎస్ వ్యాధిగ్రస్తులకు ఇమ్యునోగ్లోబులిన్ వంటి టీకాలను వేయడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించే అవకాశం ఉంటుంది. ఈవ్యాధి ఎక్కువగా నడి వయస్సు ఉన్న పురుషుల్లో ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

### జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు


జీబీఎస్ వ్యాధి నియంత్రణపై అప్రమత్తమైన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ జిల్లాలకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారిని ఎప్పటికప్పుడు గుర్తించి చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాలను ఆదేశించింది. అందుకు తగ్గట్టుగానే జిల్లా కేంద్రంలోని 200 పడకల జీజీహెచ్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యాధి బారినపడిన వారిని ఐసీయులో ఉంచి చికిత్స అందించే అవకాశం ఉన్నందున ఆస్పత్రిలోని ఐసీయు వార్డును పూర్తిగా జీబీఎస్ రోగులకు వాడనున్నారు. కొంత మందికి వెంటీలేటర్ అవసరం పడే అవకాశం ఉన్నందున ఐసీయు వార్డునే ఉపయోగించనున్నారు. ఇప్పటికే ఆస్పత్రికి వస్తున్న రోగుల్లో వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు సిబ్బందికి సూపరిటెండెంట్ నవీన్ కుమార్ స్పష్టమైన ఆదేశాలను జారీచేశారు.



### మహారాష్ట్రలో వేగంగా విస్తరిస్తున్న జీబీఎస్

భూపాలపల్లి జిల్లాకు పొరుగున ఉన్న మహారాష్ట్రలో జీబీఎస్ వ్యాధి వేగంగా ప్రబలుతోంది. ఇప్పటికే ఆ రాష్ట్రంలో 181పైగా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో పాటు నలుగురు మృత్యువాత పడినట్టు మహారాష్ట్ర వైద్యశాఖ వర్గాలు వెల్లడించాయి. మహారాష్ట్ర నుంచి నిత్యం పదుల సంఖ్యలో రోగులు మహాదేవ్‌పూర్ సీహెచ్‌సీ, జీజీహెచ్‌కు వస్తుంటారు. మహారాష్ట్రలో వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుండం, అక్కడి నుండి రోగులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తుండటంతో జిల్లాలో వ్యాధి ప్రబాలే అవకాశం లేకపోలేదు. జీబీఎస్ అంటువ్యాధి కాకపోయిన వ్యాధి తీవ్రత పెరిగిన రోగుల వల్ల ఇతర రోగులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. మరోవైపు జీబీఎస్ రోగులకు అందించే ఇమ్యునోగ్లోబులిన్ టీకాలు జీజీహెచ్‌లో అందుబాటులో లేవు. ఇలాంటి పరిస్థితుల్లో మహారాష్ట్ర నుంచి వచ్చే రోగుల్లో జీబీఎస్ లక్షణాలు ఉంటే అధికారులు అప్రమత్తం అయ్యి చికిత్స అందించకపోతే మరణాలు సంభవించే అవకాశం ఉంటుంది. వైద్యఆరోగ్యశాఖ అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తం అయ్యి ప్రత్యేక క్యాంపులు నిర్వహించి జీబీఎస్ రోగులను గుర్తించి చికిత్స అందించాల్సిన అవసరం ఉంది.

**జీజీహెచ్‌లో అన్ని ఏర్పాట్లు చేశాం**



కోడూరి నవీన్‌కుమార్, సూపరింటెండెంట్

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఆదేశాలనుసారం జీబీఎస్ రోగుల కోసం జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతానికి జీజీహెచ్‌లో పాజిటివ్ కేసులుయియ నమోదు కాలేదు. కేసులు నమోదైతే చికిత్స అందించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశాం. కేసులు నమోదైతే ఐసీయు వార్డులో చికిత్స అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న రోగులను గుర్తించి పరీక్షలు చేయాలని సిబ్బందికి ఆదేశించాం.

# మేడారంలో ఘనంగా తిరుగువారం



సమ్మక్క, గుడి ఎదుట ముగ్గులు వేస్తున్న మహిళలు

తాడ్వాయి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో తిరుగువారం పండుగను వన దేవతల పూజారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలో సారలమ్మ మందిరాన్ని, పూజాసామగ్రిని ఈ సందర్భంగా శుభ్రపరిచారు. ఈ క్రమంలో దీపదూప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా జాతర వరకు ప్రజలను సుభిక్షంగా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండేలా దీవించాలని పూజారులు కుటుంబ సమేతంగా వనదేవతలను వేడుకున్నారు. అనంతరం వన దేవతల పూజాసామగ్రిని ఆయా తల్లుల మందిరాల్లో భద్రపరిచారు. దీంతో మేడారం మినీ జాతర తంతు ముగిసింది. వచ్చే ఆదివారం పూజారులు వనభోజనాలకు వెళ్లనున్నారు.



సమ్మక్కకు కల్లు నైవేద్యం సమర్పిస్తున్న పూజారులు

### తిరుగు వారంలో భక్తుల సందడి

మేడారంలో బుధవారం తిరుగువారం సందర్భంగా భక్తులు సందడి చేశారు. సుమారు లక్ష మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. జంపన్న వాగులో పవిత్ర స్థానాలు ఆచరించి తల్లులకు ఎత్తు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమతో మొక్కులు చెల్లించుకున్నారు. 'చల్లంగా చూడు తల్లీ' అంటూ వనదేవతలను భక్తులు వేడుకున్నారు.

# కరాటే మాస్టర్.. కాదు.. ప్రిన్సిపాల్!

ఈ ఫొటోలో కత్తి పట్టుకొని సాము చేస్తున్నది కరాటే మాస్టర్ కాదు. ఆయనో పాఠశాల ప్రిన్సిపాల్. చదువు చెప్పడమే కాదు స్వీయరక్షణ విద్యను నేర్పడం లోనూ ఆయన దిట్ట. ఈ ఏడాది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ఆదర్శ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీపైవచ్చిన పరిమి నవీన్ మార్షల్ ఆర్ట్స్‌లో భాగమైన కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించారు. ఈ క్రమంలో తనకు తెలిసిన విద్యను తాను పనిచేస్తున్న పాఠశాలలోని విద్యార్థులకు పంచుతున్నారు. వారికి కరాటేలో శిక్షణినిస్తున్నారు. కటాస్‌లు, నాంచాక్‌లను ఎలా ఉపయోగించాలో వారికి తర్ఫీదునిస్తున్నారు. దీని వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, బాలికల ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని నవీన్ చెబుతున్నారు. ఇలా ప్రిన్సిపాల్ తనకు తెలిసిన స్వీయరక్షణ విద్యను విద్యార్థులకు అందించడం పట్ల స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

\- కేసముద్రం, ఆంధ్రజ్యోతి





విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ నవీన్

# స్వరజ్ఞాని.. సంగీత విద్వన్మణి

- భక్తి పాటల తేనె ఊట.. సాహితీవేత్త
- 'మహా ప్రాణ దీపం.. శివమ్'తో సినీ గేయ రచయితగా మరింత గుర్తింపు
- బహుముఖ ప్రజ్ఞాశాలి వేదవ్యాస రంగ భట్టర్

**నేడు వేదవ్యాస రంగ భట్టర్ వర్ధంతి**

హనుమకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భక్తిపాటలతో సంగీత సామ్రాజ్యాన్ని కొత్తపుంతలు తొక్కించి తనదైన శైలిలో అద్భుత పాటలతో ఆధ్యాత్మిక సినిమాలకు నిండుదనం తెచ్చిన సాహితీవేత్త.. సినీ గేయ రచయిత వేదవ్యాస రంగభట్టర్. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆయన వాగ్గేయకారుడిగా.. సంస్కృత పండితుడిగా.. నాటక రచయితగా.. రంగస్థల నటుడిగా... బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. ఆయన పూర్తి పేరు శ్రీ రంగం శ్రీ వేదవ్యాస శ్రీ రంగరాజ రంగభట్టర్. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని కోమటి పల్లి అగ్రహారంలో శ్రీరంగరాజ భట్టర్, రంగనాయకమ్మాళ్ దంపతులకు జన్మించిన రంగభట్టర్ బాల్యమంతా కోమటిపల్లిలోనే గడిచింది. అక్కడి సంస్కృత పాఠశాలలో పాఠశాల స్థాయి విద్య పూర్తి చేసిన ఆయన ఆ తర్వాత హైదరాబాద్ సీతారాం బాగ్‌లోని ప్రాచ్యకళాశాలలో సంస్కృతంలో బీవోఎల్ పూర్తి చేశారు. 1968లో తిరుమల తిరుపతి దేవస్థానం ఓరియంటల్ కాలేజీలో సంస్కృత ఆచార్యుడిగా చేరారు. ఆ తర్వాత శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో ప్రధానాచార్యులుగా బాధ్యతలు నిర్వర్తించి ఇదే కళాశాలలో సాహిత్యశాఖ అధ్యక్షుడిగా, ప్రిన్సిపాల్‌గా పని చేసి 2004లో ఉద్యోగ విరమణ చేశారు. వేద వ్యాస రంగభట్టర్‌కు ఐదుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. వేదవ్యాసకు ప్రముఖ సినీ గేయ రచయిత జేజే భారవి స్వయాన తమ్ముడు. మరో సోదరుడు ఆనంద్ భట్టర్ గొప్ప సంగీత విద్వాంసుడు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టులో కీలక పదవిలో ఉన్నారు. ఇంకో సోదరుడు శ్రీరామ భట్టర్ ప్రఖ్యాత హరికథా కళాకారుడు. వేదవ్యాస రంగ భట్టర్‌కు భార్య విజయలక్ష్మి, కుమారుడు శ్రీనివాస్ భట్టర్‌తో పాటు ముగ్గురు కుమార్తెలున్నారు. రంగభట్టర్ ఉద్యోగ రీత్యా తిరుపతిలోనే స్థిరపడినా తాను పుట్టి పెరిగిన ఊరు కోమటిపల్లిని ఎప్పుడూ మరిచిపోలేదు. అపుడప్పుడూ సొంత ఊరుకు వచ్చి తన చిన్ననాటి నేస్తాలను కలిసి.. బాల్యస్మృతులను నెమరు వేసుకునేవారు. అయితే ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడి ఆయన తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2019 ఫిబ్రవరి 20న కన్నుమూసారు. సంగీత, సాహిత్య, నాటక కళారంగాలతో సుసంపన్నమైన ఓరుగల్లు ప్రజలు ఇంత గొప్ప కళాకారుడు, సాహితీవేత్తను విస్మరించడం, కనీసం ఆయన వర్ధంతి, జయంతులకు కార్యక్రమాలను కూడా జరపకపోవడం విచారకరమని సాహితీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు.



### సత్కారాలు

సాహిత్యంలో రంగభట్టర్ చేసిన సేవలకుగాను 2003లో నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నంది అవార్డుతో సత్కరించింది. వివిధ సాహితీ, సాంస్కృతిక సంస్థల నుంచి కళాతపస్వి, దర్శకరత్న, కళారత్న, సాహితీ సార్వభౌమ లాంటి బిరుదులను అందుకున్నారు. వరల్డ్ ఆమేజింగ్స్ రికార్డ్ ఆఫ్ ఇండియా, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ నుంచి సత్కారాలు పొందారు.




### గేయ రచయితగా..

వేదవ్యాస్ రంగభట్టర్ కొన్ని వందల పాటలు రాసారు. భక్తి పాటలకు లెక్కేలేదు. అప్పట్లో ఆయన సంగీత దర్శకత్వంలో కొన్ని వందల పాటల క్యాసెట్లు వచ్చాయి. శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం స్ఫూర్తిగా ఆయన వివిధ దేవుళ్లపై 58 సుప్రభాతాలు రాశారు. అందులో విద్యార్థులను మేలుకొలుపుతూ రాసిన సుప్రభాతం కూడా ఉంది. వేదవ్యాస సంగీత దర్శకత్వంలో ఎస్పీ బాల సుబ్రమణ్యం, పి సుశీల, జానకి లాంటి ప్రముఖ గాయనీ గాయకులెందరో పాడారు. 1986లో తొలిసారి ఆయన రంగవల్లి సినిమాకు పాటలు రాశారు. ఆ తర్వాత శ్రీమంజునాథ, రామదాసు, పాండురంగడు, షిరిడీ సాయి, అనగనగా ఒక ధీరుడు, ఝుమ్మంది నాదం, ఓం నమో వెంకటేశాయ... ఇలా అనేక సినిమాలకు సాహిత్యం అందించారు. శ్రీ మంజునాథ చిత్రంలో 'మహా ప్రాణ దీపం.. శివమ్.. శివమ్' పాటను రాసింది వేదవ్యాసే. ఈ పాట రంగభట్టర్‌కు మంచిపేరు తెచ్చిపెట్టింది. స్వరజ్ఞాన వర్షిణి అనే కొత్త సాహిత్య సంగీత స్వరప్రక్రియను రూపొందించి శ్రీ వేంకటేశ్వర స్వామిపై 12, 16 స్వర స్థానాలతో 320 కీర్తనలను రాశారు. అటు సంస్కృతం... ఇటు తెలుగు... ఉభయ భాషల్లో అనన్యం ఆయన ప్రావీణ్యం. భావగీతాలతోనూ భళా అనిపించుకున్నారు. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఆయనతో పలు సినిమాలకు అనేక పాటలు రాయించుకున్నారు. వేదవ్యాసకు భక్తిగీతాల రచయితగా పేరున్నా శృంగార రసాన్ని ఆవిష్కరించడంలోనూ ఆయన దిట్టే. ప్రేమ తపస్సు సినిమా కోసం 'ఏటేటో అవుతా ఉంది.. ఏదోదో ఇదిగా ఉంది..' అంటూ రాసిన శృంగార గీతం ఇందుకు ఉదాహరణ. సంస్కృతంలో అభినివేశం, వేదోపనిషత్తులపై పట్టు, భక్తిగీత రచయితగా ఆయనకు కీర్తిని తెచ్చిపెట్టాయి. 2008లో శ్రీ రామదాసులో వేదవ్యాస పాటలు అజరామరం. 'శుభకరుడు... సురుచిరుడు... భవహరుడు'.. పాట విన్న ప్రతివారిలోనూ భక్తిభావం ఉప్పొంగుతోంది. 2017లో వచ్చిన ఓం నమో వెంకటేశాయ చిత్రంలోని 'వేయి నామాల వాడ వెంకటేశుడా..' పాట కూడా శ్రీవారి నామ, రూప, సౌందర్యాన్ని సాక్షాత్కరింప జేస్తుంది. వేంగమాంబ, జగద్గురు, ఆదిశంకర, శిరిడి సాయి, పాండురంగడు తదితర భక్తిరస ప్రధాన చిత్రాల్లో అపురూపమైన పాటలు అందించారు. ఝుమ్మంది నాదం సినిమాలోని 'సరిగమపదని సప్తస్వర సంగీత సుధ... సామవేదోనాదోపాసన..' పాట సంగీతం మీద ఆయనకు ఉన్న పట్టునూ, పాండిత్యాన్ని తెలియ జేస్తుంది. చిటికెల పందిరి అనే సినిమాకు ఆయన సంగీత దర్శకత్వం కూడా వహించారు.

### నటనలో శిక్షణ

వేదవ్యాస రంగస్థల కళాకారుడు కూడా. ఆయన పలు నాటకాలను రచించారు. వాటికి దర్శకత్వం వహించారు. కొన్ని నాటకాల్లో స్వయంగా పాత్రలను వేశారు. పలువురు ఔత్సాహిక కళాకారులకు నటనలో శిక్షణ కూడా ఇచ్చారు. 1996లో తిరుపతిలోని మహతి కళామందిరంలో ఎస్వీ నట శిక్షణాలయాన్ని స్థాపించి ఔత్సాహిక కళాకారులకు పద్యపఠనం, పౌరాణిక నాటకాల్లో ఉచితంగా శిక్షన అందించారు. రోజా, సంఘవి వంటి నటీమణులకు కూడా నటనలో శిక్షణ ఇచ్చారు. అనేక నాటకాలను రాసి వాటికి దర్శకత్వం వహించారు.



# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ములుగులో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆరె కులస్థులు



కాటారంలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న యూత్ సభ్యులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లిలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆరె కులస్థులు బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుడుతాల రమేష్, సురవు యువరాజు, తిప్పారపు కిషన్‌రావు, ఇరువల యుగేందర్, వజ్జిరి చందు, బాసిడి తిరుపతి, సురవు రాజన్న, వజ్జిరి నాగరాజు, నేపాల్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ జరిగింది. బీజేపీ మండల బుర్ర వెంకటేశ్ గౌడ్, సీనియర్ నాయకులు చెక్క నరసయ్య, గజ్జనాల రవీందర్, గుండ సురేష్, మైదం శ్రీకాంత్, కిషోర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు, ఆరెపల్లిలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆరె క్షత్రియ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఆరె సంఘం నాయకులు గువ్వాడ సాంబశివరావు, సంజీవరావు, గురజాల మల్హర్‌రావు, కిషన్‌రావు, శివాజీ, గునిగంటి మహేందర్, పోలాల సరోత్తం, అది రఘు, కొడగాని మహేందర్, నాగేందర్, నవీన్, వంగ నరేష్ పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. జిల్లెల్ల ఓదెలు, నీలాల వరుణ్, లావుడియా వినోద్, శివాజీ, సురేష్, సంతు, రాజ్‌కుమార్, గణేష్, రంజిత్ పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి వైజంక్షన్ వరకు బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోళ్ల చక్రవర్తి, శివాజీ విగ్రహ ఆవిష్కర కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర జరిగింది. శోభయాత్ర నిర్వహించి వైజంక్షన్ వద్ద జెండాను ఎగురవేశారు. అనంతరం భారత్ మాతాకి జై.. ఛత్రపతి శివాజీ మహారాజ్‌కి జై.. అంటూ నినాదాలు చేశారు. అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రేణుక, చరిత్ర విభాగాధిపతి సిహెచ్. వెంకటయ్య, అధ్యాపకులు డాక్టర్ డి. నవీన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి. జ్యోతి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ కానీస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

• కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవార సమావేశమయ్యారు, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయంలో జరిగే మహాశివ రాత్రి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు, వైద్యం, భద్రత తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే గదులను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో బస్సులను నడుపాలని ఆర్టీసీ అధికా రులను ఆదేశిం చారు. పండుగ రోజుల్లో 48 గంటల పాటు మద్యం విక్రయాలను నిషేధించా లన్నారు. సమావేశంలో సింగరేణి జీఎం రాజేశ్వర్ రావు, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు సమస్యల పరిష్కారానికి 'టోల్ ఫ్రీ'

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ టీఎస్.దివాకర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నంబర్, 24/7 వినియోగదారులకు అందుబాటులో ఉండి సేవలందిస్తారని తెలిపారు. విద్యుత్ సరఫరాలో తలెత్తే ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు, ఫ్యూజ్ ఆఫ్‌కాల్స్, లోవోల్టేజీ, బ్రేక్‌డౌన్స్, ప్రమాదభరితంగా ఉన్న స్తంభాలు, వైర్ల విషయమై సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా పేరు మార్పు, బిల్లులో తేడాలు, ఏమైనా హెచ్చుతగ్గులు, ఆగిపోయిన మీటర్లు, పోయిన మీటర్లు, నూతన సర్వీసు మంజూరు, సర్వీసు క్యాన్సలేషన్, అన్నిరకాల విద్యుత్ సేవలో ఉన్న సమస్యలపై 1912కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1912పై విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకునేందుకు విద్యుత్ అధికారులను నిర్దేశించినట్టు వెల్లడించారు.

### అధికారుల ఫోన్ నంబర్లు

ములుగు విద్యుత్ అధికారి : 9440814942, మల్లంపల్లి: 8333923909, వెంకటాపూర్ : 9440814859, గోవిందరావుపేట : 9440814857, తాడ్వాయి : 7901678229, ఏటూరునాగారం : 9440814867, కన్నాయిగూడెం : 7901678232, మంగపేట : 9440814941, వాజేడు : 9440159490, వెంకటాపురం : 944081475.

## న్యాయ కళాశాల ఏర్పాటుకు ఉద్యమించాలి

వెంకటాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు కోసం ఆదివాసీలు ఉద్యమించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఆదివాసీ విద్యార్థులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇందుకోసం మండల కేంద్రంలో మార్చి 9న నిర్వహించే న్యాయ నిపుణుల సదస్సును జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నాయకులు కణతి వెంకటకృష్ణ, పూనెం ప్రతాప్, అనిల్, రాజబాబు, జయబాబు, కాక శేఖర్, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి : అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మహోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఎం.సంపత్‌రావు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన డీఎస్పీ రవీందర్, ఆర్డీవో వెంకటేశ్, రామప్ప దేవాలయ ఈవో బిల్ల శ్రీనివాస్‌లతో కలిసి సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 26 నుంచి 28 వరకు మహాశివరాత్రి మహోత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులు జాతర సమయానికి సన్నద్ధమయ్యేవిధంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులసంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, రామప్పకు వచ్చే అన్నిరోడ్లలో ఉన్న గుంతలను పూడ్చివేయాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల కోసం అవసరమైనమేర చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

## 'దేవాదుల'లో మరో మోటారు ప్రారంభం

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 19( ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో ఫేజ్-3 నుంచి మరో మోటారును ప్రారంభించి నీటిని ఎత్తి పోస్తున్నారు. ఇప్పటికే ఫేజ్-3 నుంచి ఒక మోటారు ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్న అధికారులు బుధవారం మరో మోటారును ఆన్ చేశారు. ఫేజ్-3లోని మొత్తం రెండు మోటార్ల ద్వారా భీంఘనపూర్ రిజర్వాయర్‌కు 583 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు సీఏడీ డీఈఈ శరత్‌బాబు తెలిపారు. ఇదిలా ఉండగా బ్యారేజీలోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి 2,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో మొత్తం 59 గేట్లను మూసివేసి వచ్చిన నీటిని వచ్చినట్లు నిల్వ చేస్తున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.81 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 79.50 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 79.30 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గోవిందరావుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రాజెక్టునగర్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరగగా ఆయనమాట్లాడారు. అనంతరం మోటార్ వెహికల్, విద్యాహక్కు, బాల్య వివాహ నిరోధకం, బాలకార్మిక, ఆస్తిహక్కు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, ఏజీపీ బాలుగు చంద్రయ్య, ప్రధానోపా ధ్యా యుడు చేరాలు, ఉపాధ్యాయులు పద్మావతి, స్వరూప, సరస్వతి పాల్గొన్నారు.

## 'తహసీల్దార్ వ్యక్తిగతంగా స్టేషన్‌కు వచ్చారు'

వెంకటాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు తన వ్యక్తిగత పనుల నిమిత్తమే పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పలు సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించారని, అందులో భాగంగానే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు సేకరించారే తప్ప ఇందులో ఎలాంటి అధికారిక కార్యక్రమాలు లేవని పేర్కొన్నారు.

## కోటగుళ్లలో శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

గణపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కోటగుళ్ల శివకల్యాణ మహోత్సవం పోస్టర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుధవారం కోటగుళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చారిత్రక దేవాలయాలను, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం అర్చకులు నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కల్యాణ ఆహ్వాన పత్రిక అందజేశారు.

## వంద శాతం పన్నులు వసూలు చేయాలి

### మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మార్చి మాసాంతంలోగా వంద శాతం పన్నులు వసూలు చేయా లని భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. మునిసిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డారు. నల్లా, ఇంటి పన్నుల తోపాటు ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పట్టణా భివృద్ధి కోసం పన్నులు తప్పని సరని అన్నారు. టీంలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని అన్నారు. ఇందుకు పట్టణ ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

## 'సాగునీరు ఇవ్వలేకనే వ్యక్తిగత ఆరోపణలు'

టేకుమట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు ఇవ్వలేకే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు అనుచితంగా మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి విమర్శించారు. వెంకటరమణారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రవి మాట్లాడారు. సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతుండగా వారి పక్షాన నిరసన తెలిపితే నీరు తెచ్చే ప్రయత్నం చేయాలని గానీ, నిరసన తెలిపిన వారిపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని హ హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురించి మాట్లాడే స్థాయి కోటగిరి సతీష్‌కు లేదని, వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, నాయకులు ఆకునూరి తిరుపతి, అది రఘు, ఉద్దమారి మహేష్, బందెల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంటను పరిశీలించిన వ్యవసాయాధికారి

మల్హర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : తాడిచర్లలో గడ్డి మందు స్ప్రే వల్ల పంట నాశనమైందని వచ్చిన వార్తల నేపథ్యంలో ఆ వరి పొలాన్ని మండల వ్యవసాయాధికారి శ్రీజ బుధవారం సందర్శించారు. స్ప్రే చేసిన గడ్డి మందును పరిశీలించారు. గడ్డి మందు విక్రయించిన ఫెర్టిలైజర్ షాపులో కూడా ఏవో తనిఖీ నిర్వహించారు. నిషేధిత మందులు, గడువు దాటిన మందులను విక్రయిస్తున్నారా? అని ఆరా తీశారు.

## ఎస్టీ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఏసీఎంవో

మల్హర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలోని ఎస్టీ హాస్టల్‌ను బుధవారం భూపాలపల్లి జిల్లా ఏసీఎంవో రాజారాం తనిఖీ చేశారు. హాస్టల్‌లో మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. హాస్టల్‌లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచిం చారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు సబ్బులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ కిరణ్ పాల్గొన్నారు.

## బోర్లగూడెంలో జాతర ప్రారంభం

మహాముత్తారం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్ల గూడెం గ్రామంలో బుధవారం సమ్మక్క- సారలమ్మ జాతర బుధ వారం ప్రారంభమైంది. బోర్లగూ డెం నుంచి సారలమ్మను గద్దెలకు పూజారులు తీసుకొచ్చారు. అనంత రం సమీప గ్రామమైన పోచంపల్లి నుంచి అడారాలను, లక్ష్మీదేవరను గద్దెల వద్దకు తీసుకు రావడంతో జాతర మొదలైంది. గురువారం సమ్మక్క దేవతను వనం నుంచి గద్దెలకు చేర్చనున్నారు.

## చికిత్స పొందుతూ మృతి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చేటుచేసుకుంది. ఎస్సై తాజుద్దీన్ తెలిపిన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఎద్దం శివరామేశ్(30) ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిసయ్యాడు. ఏడాదిన్నర క్రితం అచ్చాయిగూడెం గ్రామానికి చెందిన రాజేశ్వరితో అతడికి వివాహం జరిగింది. శివరామేశ్ టాటా మ్యాజిక్ వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఇంట్లో డబ్బులు ఇవ్వకుండా భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనోవేదనకు గురైన శివరమేష్ డిసెంబరు 22న ఏటూరునాగారం హైవే రోడ్డు పక్కన ఉన్న తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగాడు. వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళారం రాత్రి మృతి చెందాడు.

# విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలి

### డీఎంహెచ్‌వో గోపాల్‌రావు



ములుగులో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపం వల్ల కంటి సమస్యలు ఏర్పడతాయని, ఆకు కూరలు, గుడ్లు, పాలు, మాంసకృత్తులతోపాటు పసుపు రంగు ఎండ్లను ఎక్కువగా తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్ రావు విద్యార్థులకు సూచించారు. ములుగులోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పాఠశాలల విద్యార్థులకు సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో గోపాల్ రావు కంటి వైద్యశిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ సమయం టీవీల ముందు గడపొద్దుని, సెల్‌ఫోన్లు వాడొద్దని అన్నారు. ఇప్పటి వరకు రెండు దఫాల్లో విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించగా అందులో 1,427 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం ప్రతిరోజు 100 మంది విద్యార్థులను ఆర్‌బీఎస్‌కే వాహనాల ద్వారా కంటి స్క్రీనింగ్ సెంటర్‌కు తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, కంటి వైద్యనిపుణులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ రణధీర్, వివిధ విభాగాల వైద్యులు శ్రీకాంత్, ఆఫ్రిన్, నరహరి, శ్రీనివాస్, మల్లికార్జున్, శ్రీలత, జయప్రద, సుజాత, స్వప్న, వెంకటేష్, ప్రత్యూష, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో**

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని జవహర్‌నగర్ ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌ను డీఎంహెచ్‌వో గోపాల్‌రావు సందర్శించారు. జాతీయ నాణ్యత ప్రమాణాల అసెస్మెంట్‌ను సందర్శించి మాట్లాడారు. జాతీయ నాణ్యతా ప్రమాణాల సర్టిఫికేషన్ పొందడం వల్ల రోగి భద్రత, మెరుగైన వైద్యసేవల తోపాటు ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం సదుపాయాలు, మౌలిక వసతులు మెరుగవుతాయని అన్నారు. దీంతో ప్రజలకు నాణ్యతతో కూడిన వైద్యసేవలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం సమన్వయంతో పనిచేసిన వైద్యసిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, వైద్యాధికారి శ్రీకాంత్, డీపీవో చిరంజీవి, డిస్ట్రిక్ట్ క్వాలిటీ మేనేజర్ శరత్, లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ సంఘమిత్ర, చందన, పీహెచ్‌ఎన్ శోభ, సూపర్‌వైజర్ పుష్పకుమారి, ఆరోగ్య కార్యకర్త ఫాతిమా, ఫార్మసిస్టులు స్వర్ణలత, వెంకటరెడ్డి, హరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

మంగపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) మంగపేట మండల కేంద్రంలోని గంపోనిగూడెం రైతు వేదిక భవనంలో హార్టికల్చర్, కేన్ బయోసైన్స్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన బుధవారం సదస్సు జరిగింది. ఉద్యాన శాఖ జిల్లా అధికారి లావణ్య హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలో ఆయిల్‌పాం సాగుపై రైతులు ఆసక్తి చూపడం అభినందనీయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ఏరియా ఇన్‌చార్జి శివకృష్ణ, ప్రతినిధులు సాంబశివరావు, అఖిల్, ఏఈవో గాయత్రి పాల్గొన్నారు.

# సామాజిక కార్యకర్త దారుణ హత్య

(5వ పేజీ తరువాయి)

చేరుకొని అప్పటికే స్పృహకోల్పోయి ఉన్న రాజలింగమూర్తిని 100 పడకల ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

**పలు కీలక వివాదాల్లో జోక్యం..**

రాజలింగమూర్తి సతీమణి సరళ స్థానిక మునిసిపల్ 15వ వార్డు కౌన్సిలర్‌గా బీఆర్‌ఎస్ తరఫున ప్రాతినిధ్యం వహించారు. సరళ కౌన్సిలర్ పదవీ కాలం ముగియగా.. అప్పటికే పలు రాజకీయ కారణాలతో ఆమె, ఆమెతో పాటు రాజలింగమూర్తి బీఆర్‌ఎస్‌కు దూరమయ్యారు. ప్రస్తుతం వారు ఏ పార్టీలో లేరని తెలుస్తోంది. అయితే రాజలింగమూర్తి తొలి నుంచీ వివిధ ప్రభుత్వ, ప్రజా సమస్యల విషయంలో జోక్యం చేసుకుంటూ అటు ప్రభుత్వ, రాజకీయ పెద్దలు, అధికారులతో వైరం పెంచుకున్నాడు. స్థానికంగా కూడా పలు భూ పంచాయతీల్లో క్రియాశీలకంగా వ్యవహరించి.. కోర్టుల్లో కేసులు వేయించడం, న్యాయ సహాయం కోరి వచ్చే వారికి అండగా ఉండేవాడు. మరీ ముఖ్యంగా 2023 అక్టోబరు 23న కాళేశ్వరం 7వ బ్లాక్‌లో కుంగిన ఘటనపై అప్పటి సీఎం కేసీఆర్, నీటి పారుదల శాఖ శాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్లపై హైకోర్టులో పిటిషన్ దాఖలు దాఖలు చేశారు. ఆ సమయంలో తన భార్య బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధిగా ఉన్నప్పటికీ రాజలింగమూర్తి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ముఖ్యనేత హరీశ్‌రావు, ఇంజినీర్లపై పిటిషన్ వేయడం తీవ్ర సంచలనం రేపింది. ఇక ఈ కేసులో 2024 సెప్టెంబరు భూపాలపల్లి జిల్లా కోర్టు వారందరికీ సమన్లు జారీ చేసిన విషయం తెలిసింది. అంతేకాదు భూపాలపల్లి మునిసిపాలిటీ శివారులోని సర్వే నెం 171లో విలువైన అటవీ భూమిని అప్పటి కలెక్టర్ భవేష్‌మిశ్రా అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరించారంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇలాంటి చాలా కేసుల్లో రాజలింగమూర్తి జోక్యం చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. అంతేకాకుండా స్థానికంగా కూడా పలు భూ పంచాయితీల్లో క్రియాశీలకంగా వ్యవహరించి.. కోర్టుల్లో కేసులు వేయించడం, న్యాయ సహాయం కోరి వచ్చే వారికి అండగా ఉండేవాడని చెబుతున్నారు. ఇటీవల ఓ భూవివాదంలో కొందరి నుంచి రాజలింగమూర్తికి బెదిరింపులు వచ్చాయని సమాచారం. ఈ నేపథ్యంలోనే బుధవారం రాత్రి అతడు దారుణ హత్యకు గురవడం సంచలనం రేపుతోంది.

**పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు**

ఘటన జరిగిన ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటం, వీధిలైట్లు లేక చీకటిగా ఉండటం, సమీపంలో సీసీ కెమెరాలు లేకపోవడం లాంటి కారణాలతో ఘటన జరిగిన తీరుపై ఓ స్పష్టత రావడంలేదన్న చర్చ జరుగుతోంది. అయితే సమీపంలో ఉన్న అంబేద్కర్ సెంటర్‌తో పాటు అక్కడున్న పలు దుకాణాల వద్ద ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దుండగుల ఆటో వచ్చి వెళ్లిన కదలికలపై ఆరా తీసున్నారు. రాజలింగమూర్తి ద్విచక్రవాహనంపై ఇంటి వెళుతున్న క్రమంలో ఆటోలో మంకీ క్యాపులు ధరించి వచ్చిన దుండగులు అంబేద్కర్ సెంటర్ వైపు నుంచే అనుసరించి.. హతమార్చారని ప్రాథమిక సమాచారం. రాజలింగమూర్తి హత్య వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయా? వ్యక్తిగత కారణాలేమైనా ఉన్నాయా? ఈ ఘటనలో ఎవరి హస్తం ఉండి ఉంటుందనే అంశాలపై తీవ్ర చర్చ జరుగుతోంది.

**అంబేద్కర్ కూడలిలో కుటుంబ సభ్యుల ఆందోళన**

రాజలింగమూర్తి హత్య నేపథ్యంలో ఆయన కుటుంబసభ్యులు, బంధువులు భూపాలపల్లి అంబేద్కర్ కూలిలో బైఠాయించారు. జోహార్ రాజలింగమూర్తి అంటూ నినాదించారు. హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలంటూ భార్య సరళ, వారి కుమార్తె, కుమారుడు రోడ్డుపై పడుకుని బోరున విలపించారు. ఆ వార్డుకు చెందిన పలువురు ప్రజలు రాజలింగమూర్తి హత్యను ఖండిస్తూ నిందితులకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. 'వెంకటరమణారెడ్డి.. ఇప్పుడు మీ కళ్లు చల్లబడ్డాయా.. ఇలా చేస్తావా' అంటూ మృతుడి భార్య, వారి కుమార్తె మాజీ ఎమ్మెల్యేను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తులను బయటకు చూపించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నంచేశారు. అయినప్పటికి బాధితులు అర్థరాత్రి వరకు ఆందోళనను కొనసాగించారు.

**మేడిగడ్డ బ్యారేజీ కేసుపై నేడు విచారణ...?**

మేడిగడ్డ బ్యారేజీలో అవకతవకలు జరిగాయని, ప్రజాధనం వృథా అయిందని రాజలింగమూర్తి కేసు వేశారు. మాజీ సీఎం కేసీఆర్ సహా మాజీమంత్రి హరీశ్‌రావు, మరో ఏడుగురిపై ఆయన భూపాలపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికి ఆ కేసు విచారణ రెండు సార్లు వాయిదా పడగా.. గురువారం ఆ కేసుపై విచారణ ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సదరు ఫిర్యాదుదారుడైన రాజలింగమూర్తి హత్యకు గురవడం తీవ్ర కలకలం రేపుతోంది.

**పట్టణంలోని భూవివాదమే హత్యకు కారణం?**

భూపాలపల్లిపట్టణంలోని భూవివాదమే రాజలింగమూర్తి హత్యకు కారణమనే చర్చ జరుగుతోంది. మునిసిపాలిటీ పరిధిలోని కృష్ణకాలనీకి వెళ్లే రోడ్డులో ఉన్న భూమి విషయంలో పలుమార్లు తగాదాలు జరిగాయని, ఈ నేపథ్యంలోనే దుండగులు రాజలింగమూర్తిని హతమార్చారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఈ కోణంలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఈ భూమి వివాదంలో జోక్యం ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని సమాచారం. ఈ భూమి విషయంలో గొడవలు పడుతున్న వారే ఈ హత్యకు కారకులై ఉంటారని, అందులో రాజకీయ నేతల ప్రమేయం ఏమైనా ఉండి ఉంటుందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

**గతంలో కలెక్టర్, తహసీల్దార్‌తో తగాదా?**

భూపాలపల్లి జిల్లాలో గతంలో పని చేసిన ఓ కలెక్టర్, అలాగే, భూపాలపల్లి మండల తహసీల్దార్‌గా పని చేసిన ఒకరితో రాజలింగమూర్తికి ఉన్న తగాదా గురించి పట్టణ ప్రజలు గుర్తు చేసుకున్నారు. అనేక విషయాల్లో తలదూర్చిన రాజలింగమూర్తి బహిరంగంగానే కలెక్టర్, తహసీల్దార్లపై విమర్శలు గుప్పించారని, గతంలో పని చేసిన భూపాలపల్లి తహసీల్దార్ సైతం బహిరంగంగానే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ప్రతీ భూవిషయంలో కలుగజేసుకుంటూ రెవెన్యూ వ్యవస్థనే బద్నామ్ చేస్తున్నాడంటూ వ్యాఖ్యానించిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటున్నారు. అప్పట్లో 'బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తే ఆయన పని అంతే' అనే చర్చ కూడా జరిగిందని చెబుతున్నారు.

**కారకులు ఎవరున్నా ఉపేక్షించం**

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

భూపాలపల్లి పట్టణంలోని తాజా మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ భర్త రాజలింగమూర్తిని మృతి వెనుక కారుకలైన వారు ఎవరున్నా ఉపేక్షించమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. ఈ ఘటన జరిగిన విషయం తెలియగానే 100 పడకల ఆసుపత్రికి వెళ్లి రాజలింగమూర్తి మృతదేహాన్ని పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులకు ఆయన భరోసానిచ్చారు. త్వరగా దోషులను గుర్తించి శిక్ష పడేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. ఏమైన సమస్యలుంటే పరిష్కరించుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయని, ఇలా హత్య చేయడం ఏంటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.